



(ఉరుముల ధ్వనితో గాలివాన ప్రారంభమై క్రమంగా హెచ్చిపోతుంది. మధ్య మధ్య *Crowd effect.* రెండు నిముషాల తరవాత గాలివాన జోరు తగ్గి దూర దూరాలనుంచి మాటలు స్పష్టంగా వినపడుతవి.)

విశ్వనాథంగారు: అబ్బబ్బబ్బ — ఏం వాన, ఏం వాన ఇంత నాణ్యమైన పాత గొడుగు కూడ యీ వానలో ఉపయోగపడేట్టులేదు. ఝుయ్యిమని ఉండుండి గాలికొట్టంగానే నాలుగేపుల్నుంచి జల్లు కొట్టి చొక్కా ధోవతీ తడిసిపోతున్నయి. కొంప చేరాలంటె ఇంక దాదాపు అర మైలు నడవాలి. (వెనకనుండి "విశ్వనాథం గారూ" అని పిలుపు) ఎవరది? పరమా ఫుల్లా పిలుస్తున్నాడు! వానలో గొడుగు చేత బట్టి నడచేవాడు ప్రతివాడికీ ఆప్తబంధువే! (మళ్లీ పిలుపు వినపడుతుంది.) ఆ ఆ అదుగో ఇటే వస్తున్నాడు ఈన ఎక్కణ్ణో చూచిన మొహమే. కాని పేరేమిటో తెలీదే! బహుశ గొడుగు చూసే వెంబడి పడ్డాడు

సీనయ్య: నమస్కారమండీ విశ్వనాథం గారూ. పాపం గొడుగు ఉండికూడా వానలో తడుస్తున్నారు. (ఇద్దరు నీళ్లల్లో నడుస్తున్న ధ్వని)

విశ్వ: ఈలా ఝుయ్యిమని గాలి కొడుతుంటె గొడుగు ఏం ఆగుతుందండి...... అయితే...మరి లోపలికి రాండి మరీ తడుస్తున్నారు. (వాన నిలిచి కొడుతున్న శబ్దం)

సీనయ్య: నడవండీ, లోపలికొస్తేమాత్రం ఒక్క గొడుగు బ్రహ్మాండమైన యీ వానలో ఇద్దరికీ ఏం సహాయపడుతుంది? అయినా తడిసిన వాణ్ణి ఎట్లాగో తడిశాను మొక్క మొలిచిపోతానా యేం.

విశ్వ: అట్లా అంటారేం లోపలికిరాండి ఫరవాలేదు. ఏదో వానలో గొడుగు వేసుకు వెళ్తుంటే పిలిచినప్పుడు ఆ మాత్రం సహాయం చెయ్యలేకపోతాం.

సీన: సరే మిమ్మల్ని గొడుగుకోసం పిల్చాననుకున్నారు కాబోలు. అబ్బే! అట్లాగైతే ఆ దుకాణంవాడు నాకు బాగ పరిచయం. గొడుగు యిస్తాను పంతులుగారు పట్టుకెళ్లి వాపసు చెయ్యండి అన్నాడు. ఈ వానలో వాడి గొడుగు నేను పట్టుకెళ్తే వాడు ఇబ్బందిపడతాడని నేనే వద్దులే వోయ్ అన్నాను. ఇంతకూ మా యింటి మీదుగానే గదా మీరూ వెళ్లేది తోటు తోడుగా పోవచ్చునని పిలిచాను.

విశ్వ: ఓహో అలాగా

సీన: అవునుగాని తమ గొడుగు చాల పెద్దదండీ!

విశ్వ: (గర్వంగా) ఈ గొడుగుందే చూశారూ

సీన: అయ్యా

విశ్వ: మా తాతగారు వారి హయాంలో రెండున్నరకి కొన్నారు. మా నాన్నగారు భద్రంగా వాడి నాదాకా దాచారండీ! ఈ నాటికూడా చెక్కు చెదర్లేదు. కాస్తంత ఈ బట్టు ఆ నాలుగు ఒత్తాలు మాత్రం ఊడినయ్యి. ఈ మధ్య నేనండి ఆ నాలుగు చిల్లులు పడింది అయినప్పటికీ ఈ మధ్యన వచ్చే వెధవ సరుకు దీనిముందు బలాదూరంటే నమ్మండి.

సీన: అసలు ఆ కాలపు సరుకు నిజాయితీ ఏ అంత పైగా మన పెద్దవాళ్లు అస్తారపదంగా దాచి వాడుకొనేవాళ్లు. ఇంతెందుకు మూడు నెలలయింది. పన్నెండు రూపాయలచొప్పున రెండు గొడుగులు కొన్నాను. ఇట్టె నాలుగు రోజులు వాడానో లేదో బెత్తం ఇరగటం, కడ్డీలు వంగిపోవటం, బట్ట చినగటం ఇదీ వరస! ఎందుకూ పనికిరాక మూలపడేశానంటె నమ్మండి మీ గొడుగుకట్టు చూడండి ఎంత దృఢంగా యీ నాటికి చెక్కు చెదరకుండా ఉందో!

విశ్వ: చూశారా

సీన: అయ్యా

విశ్వ: అసలు దీనికీ ఈ వాటివాటికీ పోలికక్కడిదండీ? నా చిన్నతనంలో బాగా జ్ఞాపకం, ఇంట్లో పందిరి మంచంపై కట్టు విరిగితే వడ్రంగిని పిలిపించి మా నాన్నగారు ఈ గొడుగు కట్టుగా తయారు చేయించారు.

సీన: అలా చెప్పండి

విశ్వ: చూశారూ!

సీన: అయ్యా... ఆ అన్నట్టు నేను పొడగర్ని కావటం మూలాన మీరు గొడుగుని చాల ఎత్తిపట్టుకోవాల్సి వస్తున్నది. చెయ్యి నెప్పి పుడుతుందేమో... నేను పట్టుకుంటాను ఇటు తేండి.

విశ్వ: అబ్బె ఫరవాలేదు.

సీన: ఆహాఁ మీ చెయ్యి నెప్పి పుడుతుంది. ఇటు యియ్యండి.

విశ్వ: వెధవజల్లు గొడుగు మార్చేలోగానే బుజంమీద చొక్కా అంతా తడిసింది. అన్నట్టు కాస్త ఈ వైపు పడతారా గొడుగు.

సీన: అయ్యో అంతకంటేనా!

విశ్వ: తమ యిల్లు దాట్లోనే అన్నారు కదూ?

సీన: ఆ అదేం ఆ బజారు మలుపు దాటితే ఆ వచ్చే సందులో ఉన్న ఎడం వైపు కొందిలో చిట్టచివరయిల్లే. ఆ సందుకుండానే మీరు రోజూ ఇంటికి పోయేది.

విశ్వ: అవునవును.

సీన: అయ్యా—చూశారు, అసలు నా జీవితంలో చాలమందిని చూశాను. కాస్తంత తీవ్రంగా ఎండ కొడుతున్నా లేక మేఘం వేసి తుప్పర ప్రారంభమైనా గొడుగు చేతిలో ఉంటే సరి ప్రపంచమే కనిపించదు. ఎవరు పలకరించినా వినపడనట్లు నటిస్తారు. పొయ్యేనాడు ఏంకట్టుకుపోతారండీ వీళ్లంతా.

విశ్వ: చూశారూ

సీన: అయ్యా

విశ్వ: కాస్త మర్యాదా మన్ననా ఎరిగిన పెద్దమనిషైతే అలా చెస్తాడా?

సీన: అవునా. ఇట్టే కేకయ్యంగానే మీరు కాబట్టి నిలిచిపోయారు. అయినా నేనసలు గొడుగుకోసం అంటూ పిలవనూ లేదు.

విశ్వ: అబ్బె పిలిస్తే మాత్రం తప్పేముంది......ఆ కాస్తంత, కొద్దిగా, గొడుగు ఈ వైపు పడతారు వెధవజల్లు మరీ తడుస్తున్నా.

సీన: అయ్యో అవశ్యం. అసలు తమరు పూర్తిగా గొడుగులో నడవండి విశ్వనాథం గారూ. మరీ తడిసిపోతున్నట్టుంది...ఏదో పెద్దల్ని సేవించటం దైవికంగా కలిగింది.

విశ్వ: ఏం అలా కలవిచ్చారు.

సీన : నేను పొడగర్ని కావటంవల్ల నేగానుకి ఈ మాత్రం గొడుగు పట్టగలిగాను!

విశ్వ : కొంపతీసి యిది సేవగా మాత్రం ంటగట్టబోకండి మహానుభావా. అనవసంగా మీకు ఋణాన పడిపోతాను.

(ఇద్దరూ నవ్వు)

సీన : అదిగో ఆ కనపడేదే మాయిల్లు... మాకు చాల శ్రమయిస్తున్నాను క్షమించాలి. మీరు మా యిల్లు యిదివరకు చూడలేదుగా, దయ చెయ్యండి.

విశ్వ : సరే పొండి...

(సీనయ్యగారింట్లో సీనయ్య భార్య సీతాయమ్మ పిల్లవాడిమీద అరుస్తుంటుంది)

సీతా : ఎట్లా చచ్చేదిరా, తడిస్తే తడికావు తువ్వాల నెత్తి నేసుకు వెళ్లరాబాబూ అంటే అపుకూర్చున్నావేంరా!... అదుగో నాన్నారు ఎవరిదో గొడుగు పట్టుకొచ్చారే...ఏవండోయ్ మిమ్మల్నే.

సీన: విశ్వనాథంగారూ ఈపంచలో కాస్త విశ్రాంతి తీసుకోండి. ఇప్పుడే వెళ్దాం

విశ్వ : (ఆశ్చర్యంగా) మళ్లీ మీరూ వస్తున్నారా!

(సీనయ్య వినిపించుకోకుండా లోపలికెళ్తాడు. లోపల భార్యాభర్తల సంభాషణ బైటికి వినపడుతూనే వుంటుంది)

సీతా : కాస్త గొడుగు ఇటివ్వండి. ఈ పట్టుకుంక వానకి ముడిసి కడుపుబ్బినా అపుకూర్చున్నాడు. దొడ్లో ఆరగట్టిన చీరకూడా విప్పుకురావాలి.

సీన : అయ్యో అయ్యో! అట్లా లాక్కెళ్తావేమే! ఇది మన గొడుగు కాదు. ఆ పెద్దమనిషి వాకిట్లో కూచున్నాడు.

సీతా : ఎవరిదైతేనేం. కాయుక్కుంటామా మరీసొద్దెం. ఆయన మాత్రం ఏవంటాడు. అవతల పట్టాడు కడుపుబ్బి ఏడుస్తొంటే.

(బైట విశ్వనాథంగారు)

విశ్వ : బాగానే వుంది ఖర్మ. జారిన పోయేవాణ్ణి పట్టుకోని యింటిదాకా గొడుగులో వచ్చింది చాలకనా. పిల్లాడి అక్కుడుకీ, పెళ్లాం ఆరగట్టిన చీర విప్పుకు రావటానికీ నా గొడుగే! నా గొడుగు వీళ్లిలా మర్యాదలేకుండా వాడుకుంటుంటే వాకిట్లో గుడ్లప్పచెప్పి గుటకలు మింగుతూ కూచోనేది. ఛీఛీ-వీళ్లకి కాస్త బుద్ధంటూ వుండాలిగాని ఏవని అడగను. నా మెతకతనం మొహమాటం చూసి మరీ యింత చొరవా?...ఇంతకూ బైటికి రాడేం ఎంత సేపటికీని......ఏమండోయ్ ఏమండోయ్ నా గొడుగు యిప్పించండి త్వరగా వెళ్లాలి.

సీన : (లోపల్నుంచి) ఏమే గొడుగీలా తే—ఆ ఆ వస్తున్నానండోయ్ విశ్వనాథంగారూ! తమకు చాల శ్రమ యిచ్చాను క్షమించాలి.

విశ్వ : అబ్బె దానికేంలెండి. ఫరవాలేదు. గొడుగివ్వండి వెళ్లొస్తా.

సీన : నేను మీతో బాటు అందాకా వచ్చి అటునుంచి దుకాణానికి వెళ్తాలెండి. వెధవ చినుకులు ఇంకా తగ్గనే లేదు.

విశ్వ : స-రే-మరి నడవండి త్వరత్వరగా గొడుగు నేను పట్టుకుంటా ఇటివ్వండి.

సీన : అబ్బె! ఎందుకు నేనుండగా, గబగబా నడవండి (బస్సు వచ్చి ఆగిన శబ్దం) విశ్వనాథంగారూ నేవెళ్లుతున్నాను. బస్సు టైముకే వచ్చింది. సరిగ్గా దుకాణం ముందుగా వెళ్తుంది. కదుల్తున్నది ఎక్కేస్తున్నాను.

విశ్వ : అయ్యో అయ్యో గొడుగు గొడుగు

(బస్సు కదలిపోతుంది.)

సీన : అరెరెరె, బస్సు కదిలింది. పొరపాటున గొడుగుతోనే ఎక్కేశాను!

విశ్వ : (ఆదుర్దాగా) విసిరెయ్యండి, విసిరెయ్యండి పట్టుకుంటాను.

సీన : విసిరేస్తే విరిగి పోతుంది. రేపు తెస్తాలే బస్సెంబడి పరిగెత్తకండి ప్రమాదం ప్రమాదం (బస్సు దూర దూరాల పోయిన ధ్వని)

విశ్వ : ఆరి పిడుగా, మొహమాటానికి పోతే గొడుక్కాస్తాపోయింది. ఛీఛీ గట్టిగా అనలేనుగదా అని ఎంత పని చేశాడు... చినుకులింకా పడుతున్నై. కండువా నెత్తి నేసుకోనన్నా నడుస్తాను, రేపు తెచ్చిస్తానన్నాడుగా! ★

(ఆల్ ఇండియా రేడియో హైదరాబాద్ సౌజన్యంతో-)

